# భారతీయ కుటుంబ జీవనం

– డా॥ గంగిశెట్టి శివకుమార్

**ప్రస్తావన :–** ప్రపంచంలో అత్యంత విశిష్టమైంది భారతీయ కుటుంబ వ్యవస్థ. కుటుంబంలోని వ్యక్తుల మధ్య విడదీయరాని అనుబంధం ఈ వ్యవస్థ ప్రత్యేకత. పూర్వం భారతీయ కుటుంబం సమష్టిగా ఉండేది. కుటుంబం అంటే భార్య, పిల్లలూ, భర్త మాత్రమే కాదు, తాతముత్తాతలు, అమ్మమ్మలు, జేజమ్మలు, నాయనమ్మలు, పినతండ్రులు, అన్నలు, వదినెలు, అక్కాచెల్లెళ్లు, బావలు – ఇలా మొత్తం బంధువర్గంతో ఉండేది. కుటుంబంలోని బంధుత్వాలు కుటుంబ వ్యక్తులమధ్య సంబంధాన్నీ, ఆత్మీయతనూ, గౌరవాన్నీ పెంపొందిస్తాయి. అచారవ్యవహారాలూ, సంస్కృతీసంప్రదాయాలూ



తరతరాలుగా కొనసాగుతున్నాయంటే అందుకు కారణం కుటుంబవ్యవస్థే.

సంఘజీవనానికి పట్టుగొమ్మ కుటుంబం. కుటుంబానికి పర్యాయపదం పరివారం. రెండుమూడు తరాలవాళ్లు అంటే తాత, బామ్మలు వారి సంతానం, మనుమలు కలిసి మెలిసి ఉండేదే కుటుంబం. పశువులకూ, పక్షులకూ సమస్తజీవరాశికి కుటుంబం ఉంటుంది. మానవకుటుంబం జ్ఞానంతో కూడింది, కనుక ఎంతో విశిష్టమైంది.

కుటుంబ సంక్షేమం కోసం పురుషుడు చేసే ప్రతిపనిలోనూ భార్య సగం పంచుకునేది. భర్తకు సన్మానం చేయవలసి వస్తే భార్యను పక్కన కూర్చోపెట్టి సత్కారం చేస్తారు. పురుషుడు ఉన్నత పదవులు అలంకరిస్తే అతని భార్యకు గౌరవమర్యాదలు పెరుగుతాయి.



వివాహం స్త్రీ స్థాయిని, స్థానాన్ని పెంచుతుంది. అంతవరకు ఒకరికి కూతురుగా, ఒక ఇంట్లో సభ్యురాలుగా ఉన్న ఆమె పెళ్లికాగానే ఒకరి ఇల్లాలుగా, ఒక ఇంటికి యజమానురాలుగా మారుతుంది. ఆమె ఇల్లు, ఇంటిపేరు, గోత్రం మారిపోతాయి.

భర్తచాటు భార్యగా మెలగడం తప్ప – ఆమెకు ప్రత్యేకత ఏమీ లేదా? అనే సందేహం కలగవచ్చు. సంపాదనాపరురాలు కాకపోయినా కుటుంబ గౌరవాన్ని ప్రభావితం చేయగలశక్తి భార్యకు వుంటుంది. అతిథుల్ని, బంధువుల్ని ఇల్లాలు ఆదరించే తీరు సంఘంలో యజమాని గౌరవాన్ని నిర్ణయిస్తుంది.

భారతీయ సమాజంలో తల్లీబిడ్డల అనుబంధం కూడా పటిష్టమైంది. తల్లి ప్రాణపదంగా బిడ్డలను ఎల్లప్పుడూ కాపాడుతూ వుంటుంది. బాల్యదశ దాటిన



తరువాత కూడా పిల్లల్ని పసికందులుగా భావించి, జాగ్రత్తలు తీసుకోవడం భారతీయ మహిళ ప్రత్యేకత. తల్లిలో సద్గుణాలు ఉత్తమ సంస్కారం ఉంటే బిడ్డలు ఆదర్శప్రాయులైన వ్యక్తులుగా అభివృద్ధి చెందుతారు. మహాత్మాగాంధి, ఛత్రపతి శివాజి జాతిని నడిపించే నేతలుగా పెంపొందడానికి వారి మాతృమూర్తుల బోధనలే కారణం.

సోదరీ సోదరుల మధ్య అనుబంధం భారతీయ జీవనంలో మరో ముఖ్యాంశం. ఇంటి ఆడపడుచుల యోగక్షేమాలు చూడవలసిన బాధ్యత అన్నదమ్ములదే! ఏ కష్టం వచ్చినా అండగా నిలచేది అన్నదమ్ములే!

'భగినీ హస్త భోజనం' అనే భారతీయ సంప్రదాయ పర్వదినం (పండుగ) సోదరీ సోదరుల అనుబంధానికి సంకేతంగా నిలుస్తుంది. కార్తీక శుద్ధ

విదియనాడు ఈ పండుగ జరుపుకుంటారు. ఆ రోజున సోదరుడు తన సోదరి చేతి వంట తినాలి. ఆమె ఇంటికి వెళ్లాలి. వెళ్లేటప్పుడు తన స్థాయిని అనుసరించి వస్త్రాలూ, పూలు, నగలూ మొదలైన మంగళ ద్రవ్యాలు తీసుకుని వెళ్లడం సంప్రదాయం.

సోదరీసోదరుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధనానికి కూడా భారతీయ కుటుంబ జీవనంలో ప్రముఖ స్థానం వుంది. ప్రతియేటా శ్రావణ పౌర్ణమినాడు ఈ పండుగ జరుపుకుంటారు.

ఇంతవరకు చర్చించిన అంశాలన్నీ, భారతీయ కుటుంబజీవనంలో ఉన్న విశిష్టతలు. ఇలాంటి అనుబంధాలు, ఆప్యాయతలూ, సందడులూ ఏ ఇతరదేశాల్లోను ఇంతగా లేవనడం అతిశయోక్తి కాదు.



భార్యాభర్తల అనుబంధానికీ, అన్నదమ్ముల ప్రేమకూ సోదరీ సోదరుల అనుబంధానికీ తండ్రీ బిడ్డల సంబంధానికీ భారతీయ కుటుంబ జీవనం గట్టిపునాది వేస్తుంది. ఈ సంప్రదాయం గతం నుండి పరంపరాగతంగా వస్తూవున్నది. ముందు ముందు తరాల వాళ్లు ఈ సత్సాంప్రదాయాన్ని, కొనసాగించవలసి వున్నది.

సమస్త జీవకోటిలో మానవ జన్మ మహోన్నతమైంది. ఎందరో మహనీయులూ, మహర్షులు నడిచిన భారతావని పుణ్యభూమి-భారతీయ సంస్కృతిలో కుటుంబం సర్వోత్కృష్టమైంది. దైవభక్తీ, పాపభీతి, సంస్కృతీ, ఆచార వ్యవహారాలూ భారతీయ కుటుంబాల్లో కన్పిస్తుంటాయి. అందుకే ప్రపంచ దేశాలు భారతీయ కుటుంబ జీవనాన్ని గౌరవిస్తున్నాయి.



**కుటుంబం ద్వారా వికాసం :-**

వ్యక్తి వికాసం, తద్వారా కుటుంబవికాసానికి పూర్వీకులు కట్టుబాట్లూ, ఆచారవ్యవహారాలూ సత్సంప్రదాయాలు ఏర్పరచారు. మంచిసంప్రదాయాల్నీ, ఆచారవ్యవహారాల్నీ, మంచిచెడుల్నీ గ్రహించడంతో పాటు ఆచరణలో పెట్టగలిగినపుడే కుటుంబం వికాసం చెందుతుంది. కుటుంబ వాతావరణంలో ప్రేమ, వాత్సల్యం, ఆప్యాయతలుంటేనే పిల్లలు మంచి సంస్కారవంతులవుతారు.

పెద్దల్ని గౌరవించాలి. కుటుంబసభ్యులు చెప్పే మాటలను త్రికరణశుద్ధిగా పాటించాలి. సత్యమే పలకాలి. ధర్మాన్ని కాపాడాలి. తోటివాళ్లకు సహాయపడాలి. అలాగే మంచిచెడుల్ని నిర్ధారించవలసి వచ్చినపుడు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.



**కుటుంబవికాసం :-**

మంచి సాంప్రదాయాల్నీ, ఆచార వ్యవహారాల్నీ, మంచిచెడుల్నీ గ్రహించడంతోపాటు ఆచరణలో పెట్టగలిగినప్పుడే కుటుంబం వికాసం చెందుతుంది. కుటుంబ వాతావరణంలో ప్రేమ, వాత్సల్యం, ఆప్యాయతలు ఉంటేనే పిల్లలు మంచి సంస్కారవంతులవుతారు. పెద్దలపట్ల గౌరవ మర్యాదలతోపాటు సమాజంపట్ల బాధ్యతతో వ్యవహహరించేటట్లు చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే!

స్వామి వివేకానంద గొప్పదార్శనికుడు. హిందూసంప్రదాయ ధర్మాన్నీ, విశిష్టతనూ, గొప్పతనాన్నీ, ఇతరదేశాల వాళ్లకు తెలియజేసి, భారతీయులగౌరవ ప్రతిష్టలు పెంచాడు. ఆయన పేరు ప్రఖ్యాతుల వెనుక అతని తల్లిదండ్రులపాత్ర, ముఖ్యంగా తల్లిపాత్ర ఎంతో వుంది.

వివేకానందుడి అసలు పేరు నరేంద్రుడు. తండ్రి విశ్వనాథుడు.తల్లి భువనేశ్వరి. వృత్తిరీత్యా విశ్వనాథుడు న్యాయవాది. భువనేశ్వరి మహాభక్తురాలు. రామాయణ, భారత, భాగవత గ్రంథాల్ని కంఠస్థం చేసింది. ప్రతిదినం వివేకానందుడితోపాటు చుట్టుపక్కల పిల్లల్ని కూడా దగ్గర కూర్చోబెట్టుకుని పురాణ కథలు చెబుతూ వుండేది. భారత, భాగవత, రామాయణ కథల్లో వ్యక్తమయ్యే నీతిని, మంచిచెడ్డల్నీ తల్లి వివరించి చెప్పినందువల్లే వివేకానందుడు అంత గొప్ప మానవతావాదిగా ఎదిగాడు.

అందుకనే పిల్లలు చిన్ననాటి నుంచే కుటుంబంలో వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం యిస్తూ కుటుంబ వికాసానికి దోహదడాలి.కుటుంబ వికాసం ద్వారానే సమాజవికాసం కలుగుతుంది. అందుకే మహాత్మాగాంధీ చెడు వినవద్దు, చెడు అనవద్దు, చెడు కనవద్దు అన్నారు. అంటే



చిన్ననాటినుండే మంచి సంస్కారాన్ని అలవరచుకోవాలని అర్థం.

పెద్దలు, గురువులు, ఉన్నతస్థానంలో ఉన్నవాళ్లూ ఎదురుపడగానే నమస్కారం చేయడం సంస్కారం. ఈ సంప్రదాయం ఎప్పటి నుంచో ఉంది. పూర్వం రాజులకు రాజోద్యోగులు, ప్రజలూ వినయంగా నమస్కరించేవాళ్లు. ఋషులు వస్తున్నారంటే రాజులు ఎదురువెళ్లి, పూర్ణకుంభంతో స్వాగతం పలికి నమస్కరించేవాళ్లు. ఋషుల్ని, ఉన్నత స్థానాలపై కూర్చోబెట్టి, సకల మర్యాదలు చేసేవాళ్లు. గురువులకు శిష్యులు సాష్టాంగ దండప్రమాణం చేసేవాళ్లు.

నమస్కారం అనేది వినయ విధేయతలకు గుర్తు. ఎదుటి వ్యక్తి ఏదో ఒక విషయంలో మనకంటే గొప్పవాడై వుంటాడు. ఆయనను గౌరవించడం మనలోని సంస్కారం.



వయోవృద్ధులూ, జ్ఞానవృద్ధులూ, తల్లిదండ్రులూ మున్నగు వాళ్లకు నమస్కారం చేయడం మనధర్మం.

**పెద్దల మాట :-**

ఒక మనిషి సభ్యత, సంస్కారం అతడు పుట్టి పెరిగిన వాతావరణాన్ని బట్టి వుంటుంది. పెద్దలమాట విన్నవాళ్లకు శాంతి సౌభాగ్యాలు లభిస్తాయి. పెద్దవాళ్ల మాటలు, భావాలు ఈ కాలానికి పనికిరావనేవాళ్లు ఉన్నారు. అయితే జీవితాన్ని కాచి వడబోసిన వాళ్ల అనుభవం పరిపక్వమై విశాలంగా వుంటుంది. అందుకే పెద్దల్ని సేవిస్తూ, వాళ్ల అడుగు జాడల్లో నడిచిన వాళ్లు మంచి సంస్కారవంతులవుతారు. వారి జీవన ప్రయాణం ప్రశాంతంగా సాగుతుంది. అందుకే పెద్దల సుద్దులు పెరుగన్నం ముద్దలు అంటారు.



**ప్రత్యుపకారం – మానవధర్మం :-**

ఉపకారం చేసిన వాళ్లకు ప్రత్యుపకారం చేయడం సనాతన ధర్మం. మేలు మరచి పోవడం మహాపాపం. అనేక పాపాలకు పెద్దలు ప్రాయశ్చిత్తం చెప్పారుగాని చేసిన మేలు మరచిపోవడానికి ప్రాయశ్చిత్తం చెప్పలేదు.

చేసిన మేలు గుర్తుపెట్టుకొని, తిరిగి ఉపకారం చేయడం కృతజ్ఞత. మరిచిపోవడం కృతఘ్నత.

శ్రీరాముడి పూర్వీకులవల్ల సముద్రుడు మేలు పొందాడు. అందువల్ల రాముడి పనికోసం వెళుతున్న హనుమంతుడికి సముద్రుడు సహాయపడాలని అనుకుని, తనలో దాగి రక్షణ పొందుతున్న మైనాకుడితో "నువ్వు వెళ్లి, హనుమంతుణ్ణి కాసేపు విశ్రాంతి తీసుకుని వెళ్లమని చెప్పు" అంటాడు. రాముని పనిమీద వెళుతున్నందున మధ్యలో ఆగడం వీలుకాదని, పర్వతం చూపిన

ఆదరాభిమానాలు ఎంతో ఆనందం కలిగించాయనీ చెప్పి, హనుమంతుడు ముందుకు సాగిపోతాడు.

వేలు చేసిన వాళ్లను గుర్తుపెట్టుకుని, అవసరమైనపుడు వాళ్లకు మేలు చేయడం గొప్ప సంస్కారం.

**మిత్రధర్మం –**

కుచేలుడు చాలా పేదవాడు. కుటుంబం గడవడం చాలా కష్టంగా ఉండేది. ఒకనాడు కుచేలుడితో ఆయన భార్య, 'ఏమండీ! కృష్ణుడు మీ చిన్ననాటి స్నేహితుడు గదా! ఆయనను సహాయం అడగకూడదా!' అన్నది. కుచేలుడికి ఆమాట నచ్చి, భార్య యిచ్చిన పిడికెడు అటుకులు పంచెకొంగున కట్టుకుని కృష్ణుని చూడబోయాడు. కుచేలుణ్ణి చూసి కృష్ణుడు ఆనందపడి, కౌగలించుకుని, ఆయన తెచ్చిన అటుకులు తిన్నాడు. కుచేలుడి పేదరికం పటాపంచలై పోయింది. ఈకథ మిత్రధర్మానికి మంచి ఉదాహరణ.



**ఉత్తమ వ్యక్తిత్వం –**

భారత స్వాతంత్ర్య సమరానికి ప్రధాన సారథిగా కీర్తిగాంచిన మహాత్మాగాంధీ ఇంగ్లాండుకు వెళ్ళేముందు విదేశీ సంస్కృతి, సంప్రదాయాలపై వ్యామోహం చూపనని తల్లికి మాట యిచ్చి వెళ్లాడు. తల్లికిచ్చినమాట ప్రకారమే ఆయన జీవితమంతా నడచుకొన్నాడు. మహాత్ముడుగా ప్రపంచం మన్నన లందుకున్నాడు. మాటతప్పని తత్త్వమే ఆయన్ను జాతిపితగా చేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టింది. ఆయన సత్యసంధతే కోట్లమంది భారతీయులకు ప్రీతిపాత్రమైంది.

మానవుడు సంఘజీవి. ఏ వ్యక్తీ తనకోసం మాత్రమే జీవించలేడు. ఒంటరిగా ఏమీ సాధించలేడు. సమాజధర్మాల్ని గాని, వంశాచారాల్ని గానీ నిర్వర్తించాలంటే ఇతరుల సహకారం అవసరం. భారతీయుల సంఘజీవనానికి, కుటుంబానికీ ఇదే పునాది.



చతుర్విధ పురుషార్థాల్ని (ధర్మార్థ కామమోక్షాలు) సాధించాలంటే కుటుంబం అవసరం. వ్యక్తీ, వ్యక్తిద్వారా కుటుంబం, కుటుంబం ద్వారా సమాజం అనేవి క్రమంగా జీవితంలో ముఖ్యం.

బంధాలు, బంధుత్వాలు కలకాలం నిలవాలనే సదుద్దేశంతోనే పూర్వీకులు శుభ, అశుభ కార్యక్రమాల్లో రక్తసంబంధీకుల్ని పిలుచుకొనే సంప్రదాయంతో కుటుంబం వ్యవస్థను పటిష్ఠం చేశారు. తరచూ అందరూ కలిసి, ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటే పిల్లలు సత్సంప్రదాయాలూ, ఆచారవ్యవహారాలూ తెలుసుకొంటారు. భవిష్యత్తులో తామూ ఆ సంప్రదాయాల్ని ఆచరించడం చేత కుటుంబగౌరవం పెరుగుతుంది.

ఇల్లంటే సిమెంటు, ఇటుకలతో కట్టిన భవనమే కాదు, ఇల్లంటే అమ్మ..! ఇల్లంటే నాన్న ! సుఖసంతోషాల



వాకిలి. ఆనందాల లోగిలి. ప్రేమానుగారాల పల్లకి. అందరూ కలిసి వుండే అందమైన ఆత్మీయబంధం. ఇల్లంటే భావోద్వేగాల్ని పంచుకొనే అనుబంధాల వేదిక. ఒకే గొడుగు నీడలో సేదదీరే వ్యక్తుల సమూహమే కుటుంబం. పక్షి ఆకాశమంతా తిరిగివచ్చినా తిరిగి చేరుకునేది గూటికే. మనిషి రోజంతా ఎక్కడ తిరిగినా చివరకు చేరుకొనేది తన ఇంటికే...

**కుటుంబం – సంస్కారకేంద్రం :–**

మానవుడు సంఘజీవి. స్వతంత్రంగా జీవించడం సాధ్యం కాదు. ఒకరిపై ఒకరు ఆధారపడక తప్పదు. అలాగే సమాజంలో ఒకడుగా బతకాలంటే కొన్ని నీతినియమాలకు లోబడి జీవించాల్సి ఉంటుంది. కొన్ని మర్యాదలకు కట్టుబడాల్సి వుంటుంది. ఒక క్రమంలో తన జీవితానికి సంతృప్తి కలిగించే సాధనమే కుటుంబ వ్యవస్థ. ఒక

ప్రాణిగా పుట్టిన మనిషిని సమాజంలో భాగంగా తీర్చిదిద్దే ఒక గొప్ప వ్యవస్థే కుటుంబం. అలాంటి కుటుంబాలే సమాజం.

మన సనాతన సంప్రదాయాలూ, ధర్మాలూ కుటుంబం సుఖశాంతులతో అభివృద్ధికావడానికి ఏర్పాటయ్యాయి. ఈ ఉద్దేశంతోనే పెద్దలు మన జీవన విధానానికి అవసరమైన ధార్మికతను, భక్తి, జ్ఞానాల్ని బోధించారు. కనుక కుటుంబపెద్ద న్యాయంగా ధనమార్జించాలి. అందరూ ఆధ్యాత్మికాభిరుచి కలిగి వుండాలి. సత్యం తప్పకూడదు. పిల్లలు వినయవిధేయతలు కలిగి తల్లిదండ్రులు చెప్పే మాటలు వినాలి. అతిథుల్ని ఆదరించాలి. దేవతల్ని పూజించాలి. మంచివాళ్లతో, భక్తులతో సాంగత్యం ఉండాలి. సద్గ్రంథపఠనం అలవడాలి. ముఖ్యంగా కుటుంబంలో అందరూ ఐకమత్యంగా వుండి



ఎదురయ్యే సమస్యల్ని పరస్పరసహకారంతో పరిష్కరించుకోవాలి.

'తన్మే మనః శుభసంకల్పమస్తు' అన్నట్లు అందరి మనసుల్లో శుభమైన సంకల్పాలు కలిగి వుండాలి.

**అయం నిజః పరో వేతి గణనా లఘుచేతసామ్ ।**
**ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్ ॥**

వీడు నా వాడు, వాడు పరాయివాడు అన్న భావన సంకుచిత మనస్తత్త్వం కలవారికి వుంటుంది. ఉదారచరిత్రులకు ప్రపంచమంతా ఒకే కుటుంబం అనే భావన వుంటుంది.

' ఎల్లవేళలా నన్ను స్మరించుకొంటూ మీ జీవనయానం సాగించండి'. అని గీతలో కృష్ణ పరమాత్మ చెప్పారు. మన కుటుంబ జీవనయాత్రలో ఇంటిల్లపాదీ



భక్తితత్త్వం కలిగి, అనుక్షణం ఆ భగవన్నామాన్ని మనసులో తలచుకొంటూ, మన కర్తవ్యం మననం చేసుకుంటూ పోతే కుటుంబం సుభిక్షంగా వుంటుంది. పిల్లలకూ అదే అలవాటు చేస్తే సురక్షితంగా వుంటారు. అదే చల్లని సంసారం, చక్కని సంతానం అవుతుంది. ఇంట్లోనే నైతికవిలువలకు పునాది పడాలి. మంచి కుటుంబంతో వ్యక్తిత్వం అలవడాలి. కుటుంబజీవితం వంశాన్ని నిలిపే సాధనం మాత్రమే కాదు. తనకాలంనాటి సంస్కృతీసంప్రదాయాల్ని తరువాతి తరానికి అందించే వాహిక కూడా.

**కుటుంబానికి ఏకత్వమూలం :-**

హిందూసంస్కృతిలో ముఖ్యంగా నాలుగు ఆశ్రమాలున్నాయి. 1) బ్రహ్మచర్యం, 2) గార్హస్థ్యం, 3)వానప్రస్థం, 4) సన్న్యాసం. కలియుగంలో సన్యసించడం



కష్టం కాబట్టి గృహస్థుగానే తన ధర్మాల్ని తాను నిర్వర్తించడం ముఖ్యం.

బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమాల వాళ్లను సేవించడం గృహస్థుడి ముఖ్యధర్మం. గృహస్థుడే అందరికీ తల్లి, తండ్రీ, పాలకుడు, సంరక్షకుడు. అంటే గృహస్థునుంచే బ్రహ్మచారి, గృహస్థు, వానప్రస్థులు, సన్న్యాసులు పుడతారు. అందుచేత చతురాశ్రమపాలన, పోషణ, బాధ్యత గృహస్థు ప్రధానధర్మం.

శాస్త్రాల్లో గృహస్థుకు తీర్చుకోవలసిన అయిదు ఋణాలున్నాయి. 1) పితృఋణము, 2) దేవఋణం, 3) ఋషిఋణం, 4) భూతఋణం, 5) మనుష్యఋణం

మాతాపితరుల శుక్ల శోణితాలతో శరీరం తయారవుతుంది. తల్లిపాలతో, తండ్రి సంపాదించిపెట్టిన అన్నంతో శరీరపోషణ జరుగుతుంది. తండ్రి ధనంతో

విద్య, యోగ్యత లభిస్తాయి. తల్లిదండ్రుల ప్రయత్నం మీద వివాహం జరుగుతుంది. ఈ విధంగా బిడ్డలమీద తల్లిదండ్రుల మీద తాతానాయనమ్మలు, వాళ్లమీద వాళ్ల తల్లిదండ్రుల ఋణం ఉంటుంది. పరంపరగా ఉండే ఈ పితృఋణం నుంచి విముక్తి పొందటానికి, పితరులకు సద్గతి కలిగించడానికి వాళ్ల పేరుతో పిండప్రదానాలు, తర్పణాలు చేస్తూ ఉండడం మనకందరికీ తెలిసిందే!

వర్షాలు కురుస్తూ ఉంటాయి. నేల వేడెక్కుతూ ఉంటుంది. గాలివీస్తూ ఉంటుంది. భూమి అన్నింటినీ భరిస్తూ ఉంటుంది. రాత్రి చంద్రుడు, పగలు సూర్యుడు వెలుతురు ఇస్తూ ఉంటారు. వీటి నుంచి వాళ్లు ఏమీ ఆశించరు. దానివల్ల అందరి జీవనం జరుగుతూ వుంటుంది. ఇదంతా మనం తీర్చుకోవలసిన దేవఋణం, హోమం, యజ్ఞం చేయడం వల్ల దేవతలకు పుష్టి



కలుగుతుంది. వాటిని నిర్వహించడం వల్ల మానవులు దేవఋణం నుంచి విముక్తులవుతారు.

ఋషులు, మునులు, సాధువులు, మహాత్ములు రచించిన గ్రంథాలు, చెప్పిన స్మృతులు మనకు జ్ఞానాన్నిస్తున్నాయి. విద్యలపట్ల ఏమి చేయవచ్చో, ఏమి చేయకూడదో అనే పరిజ్ఞానం కలుగుతుంది. అందువల్ల వాళ్లకు మనం ఋణపడి ఉన్నాం. వాళ్ల గ్రంథాలు చదవడం, పఠన పాఠనాలు చేయడం, సంధ్యావందనం, గాయత్రీ జపాదులు చేయడం ద్వారా మనం ఋషిఋణం నుంచి విముక్తులమవుతాం.

ఆవు, గేదె, గొర్రె, మేక, ఒంటె, గుర్రం మొదలైన జంతువుల నుంచి మానవుడు ఎన్నోరకాల ప్రయోజనాల్ని పొందుతున్నాడు. పశుపక్ష్యాదులకు నిలువనీడను



ఏర్పరచడం, వాటికి గడ్డి, నీళ్లు సమకూర్చడం, వృక్షాలకు నీరివ్వడం ద్వారా భూత ఋణాన్ని తీర్చుకోవచ్చు.

మానవుడు సంఘజీవి గనుక ఇతరుల సహాయసహకారాలు లేనిదే ఏమాత్రం అతడి దైనందిన కార్యక్రమాలు సాగవు. ఏనాడో ఇతరులు నాటిన మొక్కల నుండి మానవుడు తనకు కావలసిన పదార్థాలను పొందుతున్నాడు. ముందుతరాలవాళ్లు చేసిన ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలద్వారా నేడు మనం ఎన్నో సౌకర్యాలనుభవిస్తూ ఉన్నాం. రాబోయే తరాల ప్రయోజనాల కోసం నేటి మానవుడు సత్కార్యాలను ఆచరించాల్సి వుంటుంది. నూతులు తవ్వించటం, తోటలు పెంచడం, రహదారులు నిర్మించడం, ధర్మసత్రాలు కట్టించడం, వృక్షాల్ని ఇతోధికంగా పెంచడం మొదలైన కార్యక్రమాల ద్వారా ఆ ఋణం తీర్చుకోవచ్చు. అయితే



హిందూ సంస్కృతిలోని ఆశ్రమ వ్యవస్థ పరదేశీయుల ననుకరించటం ద్వారా చిన్నాభిన్నం అయింది. నాలుగు ఆశ్రమాలకు మూలమైన గృహస్థాశ్రమ స్థితి మరీ ఘోరంగా వుంది. గృహస్థ జీవనంలోని వివిధ సమస్యలు, వాటివల్ల కలిగే నిరాశ, అశాంతి, జీవితాల్ని క్లిష్టతరం చేస్తున్నాయి.

ఈవిధంగా ఆయా ఋణాల్ని తీర్చుకొంటూ గృహస్థు తదితర ఆశ్రమాల వాళ్లకు పాలకుడుగా, సంరక్షకుడుగా తన బాధ్యతను నెరవేర్చడం హిందూసంస్కృతిలో ముఖ్యభాగం.

మన పురాణాల్లో గమనించినట్లయితే శంకరుడు కపాలమాలను, సర్పాన్ని ధరించి ఉన్నాడు. గణేశుడు పొడవైన తొండం, లంబోదరం కలిగి వున్నాడు. వీరి వాహనాలు వృషభం, సిహం, నెమలి, మూషికం, ఇలా వివిధరకాలుగా ఉన్నాయి. ఇవికూడా విరుద్ధస్వభావాలు

కలవి. అయినప్పటికీ ఇవన్నీ శివుడి కుటుంబంలో ఏకత్వంతో మెలగుతూ వున్నాయి.

అలాగే కుటుంబంలో వేరు వేరు స్వభావాలు కలిగిన వాళ్లున్నప్పటికీ అందరూ కలిసి మెలిసి ఉంటూ తమ అభిమానం, సుఖదుఃఖాలు, భోగాలు కొంతమేర త్యాగం చేసి, ఇతరుల హితమూ, సుఖమూ కోరుతూ పరస్పరం ప్రేమపూర్వకంగా ఏకత్వాన్ని కలిగి వుండాలి. అదే ఆదర్శకుటుంబానికి మూలం.

ఇంట్లో అందరూ సుఖంగా వుండాలి. పుత్రుడు బుద్ధిమంతుడుగా ఉండాలి. పత్ని మధురభాషిణిగా ఉండాలి. మంచి మిత్రులుండాలి. చెప్పిన పనిని విసుక్కోకుండా చేసే సేవకులుండాలి. ప్రతిదినం అతిథులకు సత్కారం, సత్సాంగత్యం, శివారాధనం



జరుగుతూ ఉండాలి. ఇలా అన్నీ సక్రమంగా జరుగుతూ వుంటే ఇల్లు పుణ్యధామంగా ఉంటుంది.

హిందూ సంస్కృతిలో మానవ జీవితానికి సంబంధించిన అన్ని క్రియలు, ఆచారవ్యవహారాలు, ధర్మబద్ధంగా ఉంటాయి. పుట్టినప్పటినుండి పోయేదాకా అన్ని పనులూ శాస్త్రోక్తంగానే నడుస్తూ వుంటాయి. అలాంటి లక్షణాలు సంపూర్ణంగా ఉన్న కుటుంబం ఐక్యత ఉన్నప్పుడే ఆదర్శవంతమవుతుంది.

'నీళ్లలో దిగి కాళ్లు తడవనివాడు, సంసారంలో దిగి కళ్లు తుడవనివాడు ఉండడు' అనేది అందరూ అనే మాటే! కానీ సంసారాన్ని కోరుకోని వాళ్లు ఎందరు? అందరూ సంసారాన్ని కోరుకొంటారు. అది సహజం.



సంసారాల్లో చింతలు, చిక్కులు అనేకం. సమయస్ఫూర్తితో, చాకచక్యంతో, ధర్మాచరణతో సంసారంలో ఎదురయ్యే చిక్కుల్ని తొలగించుకోవలసి వుంటుంది. చింతవేరు, ఆలోచన వేరు. చింత అనేది అజ్ఞానం నుంచి పుడుతుంది. దీనివల్ల అంతరంగం కలుషితమవుతుంది. బుద్ధి వికసించదు.

కానీ విచారణ లేదా ఆలోచనవల్ల బుద్ధి వికాసం కలుగుతుంది. అందువల్ల సమస్యలు ఎదురైనపుడు చింతించక, బాగా ఆలోచించి పరిష్కారం కనుగొనాలి. చింత మనసును కుంగదీస్తుంది. ఆలోచన మనిషిని ముందుకు నడిపిస్తుంది. చింతలేకుండా ఆలోచిస్తే ఏదో ఒక ఉపాయం లభిస్తుంది. అందువల్ల గృహస్థు అందరి సలహాల్ని గ్రహించి, సమస్యల్ని పరిష్కరించడం జరిగితే కుటుంబ ఐక్యత వర్ధిల్లుతుంది.



వివాహం హిందూసంస్కృతిలోని షోడశ సంస్కారాల్లో ఒక మహత్తరమైన సంస్కారం. దీనివల్ల భార్యాభర్తలు ఒకే ప్రాణమై గృహస్థాశ్రమంలో ప్రవేశిస్తారు. గృహస్థాశ్రమం ధర్మార్థకామమోక్షాలకు సంగమస్థానం. కుటుంబానికి ఇదే పునాది. సంతానంతో, బంధువులతో విలసిల్లే కుటుంబ ఐక్యతను సాధించడానికి భార్యాభర్తలిద్దరూ ప్రయత్నించాలి.

గృహస్థాశ్రమ ధర్మం అనే రథానికి భార్యాభర్తలు ఇద్దరూ రెండు చక్రాలు. ఒక చక్రం లోపిస్తే రథం సరిగా సాగదు. అనురాగం అనేది రథానికి ఇరుసు. భార్యాభర్తల మధ్య ఇది పరస్పర అవగాహనకు ఎంతగానో తోడ్పడుతుంది.

అందుకే వివాహాన్ని ఒక పవిత్రమైన ధార్మిక సంస్కారం అంటారు. మానవుడు జంతువువలె హద్దులు

లేని స్వేచ్ఛావిహారి కాకూడదు. సంయమనం పాటించాలి. భోగలాలసతను హద్దుల్లో ఉంచుకోవాలి. భావం పవిత్రంగా ఉండాలి. సంతానోత్పత్తి ద్వారా వంశాభివృద్ధి పొందాలి. ప్రేమ, కామానికి మధ్య అంతరం వుంది.

ప్రేమలో త్యాగభావం వుంది. దానగుణం వుంది. ఆత్మార్పణ వుంది. ప్రేమవల్లనే మానవజీవితానికి పరిపూర్ణత్వం లభిస్తుంది. కామం విషసంకులితం, భోగపరాయణమయం. భార్యాభర్తల మధ్య నిజమైన ప్రేమభావం ఉన్నపుడే సంసారంలో శాంతి సౌఖ్యాలుంటాయి. కుటుంబం కలతలు లేకుండా సాగుతుంది. కుటుంబంలోని వ్యక్తులందరి మధ్య ఐక్యత కుదురుకొంటుంది.



**మాతృదేవోభవ – పితృదేవోభవ :-**

భూమండలాన్ని ముందుగా చుట్టి వచ్చిన వారికి గణాధిత్యం ఇస్తానని పరమేశ్వరుడు ప్రకటిస్తాడు. కుమారస్వామి నెమలి వాహనంపై భూమండల ప్రదక్షిణకు బయలుదేరుతాడు. తల్లిదండ్రులకు ప్రదక్షిణ చేస్తే భూమండల యాత్ర చేసినట్లేనని నారదుడిచ్చిన సలహాను వినాయకుడు ఆచరించి గణాధిపత్యం స్వీకరిస్తాడు. ఈ కథ వల్ల మనకు తెలిసేదేమంటే తల్లిదండ్రులను మించిన దైవం లేదు అని. ఈ కథను మనం ప్రతి సంవత్సరం వినాయకచవితి పండుగ సందర్భంగా వింటూ వుంటాం. స్ఫూర్తి పొందుతూ వుంటాం.

పిత అంటే తండ్రి. కుటుంబానికి తండ్రి పెద్ద.తండ్రి మాటకు అందరూ విలువ యివ్వాలి.



మరోవిశేషం- మన భారతీయ ధర్మంలో తండ్రి అంటే కేవలం జన్మ నిచ్చిన వాడేకాదు,ఉపనయనం చేసినవాడూ, చదువుచెప్పిన వాడూ, అన్నం పెట్టినవాడూ, భయం నుంచీ, ఆపదనుంచీ కాపాడినవాడు కూడా తండ్రులే! అంటే వీరినీ తండ్రిగానే భావించి గౌరవించాలి.

తన తండ్రి దశరథుణ్ణి సత్యవాక్పరిపాలకుడుగా నిలబెట్టడానికి శ్రీరాముడు వనవాసానికి వెళ్లాడు. తండ్రిమాటకు ఎంతో విలువ యిచ్చి, మారుమాట లేకుండా అడవికి వెళ్లాడు.కొడుకు తండ్రిమాట మీరకూడదనే విషయం ఈ కథ ద్వారా తెలుస్తుంది.

**ఆదర్శకుటుంబం :-**

పిల్లలు, పెద్దలకు సుఖశాంతులు కలిగించాలి. వాళ్లకు పెద్దరికం యిచ్చి, గౌరవించాలి. వాళ్ల ఆజ్ఞ



పాటించాలి. వాళ్ల అదుపులో మెలగాలి. వాళ్లు చెప్పినమాట వినాలి. ఇది పిల్లల కర్తవ్యం. అలాగే పెద్దవాళ్లు వాళ్లకు వాళ్లే 'మనం పెద్దవాళ్లం పూజనీయులం, ఆదరణీయులం' అని అనుకోకూడదు. పిల్లలతో కొంత చాకచక్యంగా, కాలానుగుణంగా మెలగాలి. ప్రేమతో కార్యాన్ని చక్కబెట్టుకోవాలి. పెద్దలు పిల్లల మనసెరిగి ప్రవర్తించడం కూడా చాలా అవసరం.

పిల్లలు, పెద్దలు వాళ్ల వాళ్ల బాధ్యతల్ని గుర్తెరిగి ప్రవర్తిస్తే కుటుంబం సుఖసంతోషాలనిలయం అవుతుంది.

**ఆదర్శసంతానం :-**

తల్లి దండ్రుల ఆచరణ (నడవడి), భావాలు ఆదర్శంగా ఉన్నప్పుడే ఆదర్శసంతానం కలుగుతుంది. స్త్రీలు గర్భవతులైనపుడు భగవత్కథలు, భగవద్భక్తుల

చరిత్రలు వినాలి. వాటిని మననం చేయాలి. ఆ విధంగా తల్లి మీద సత్సంగ ప్రభావం పడుతుంది. తత్ఫలితంగా శ్రేష్ఠమైన సంతానం కలుగుతుంది. ప్రహ్లాదుడి తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు నారదుడు ఆమెకు భగవత్కథ వినిపించి, ఉపదేశం చేసినందువల్లే ప్రహ్లాదుడు పరమ భాగవతోత్తముడు అయ్యాడు.

ఒక్కోసారి తల్లిదండ్రులు మంచివాళ్లయినప్పటికీ వాళ్ళ సంతానం మంచివాళ్లుగా ఉండరు. దానిక్కారణం సాంగత్య దోషం. పిల్లలు చెడ్డవాళ్లతో చేరకుండా పెద్దలు గమనిస్తూ వుండాలి.

తల్లిదండ్రులు మంచి వాళ్లు కాకపోయినా బిడ్డలు మంచి వాళ్లుగా ఉంటారు. సత్సాంగత్యం, పరిసరాల ప్రభావం, సద్గ్రంథ పఠనం, పూర్వజన్మ సంస్కారం మొదలైన కారణాల వల్ల బిడ్డలు సహజంగానే మంచివాళ్ళవుతారు.



**పిల్లలను తీర్చి దిద్దడం :-**

పిల్లలు సాధారణంగా దేన్నైనా చూచి నేర్చుకొంటారు. అందువల్ల వాళ్ల తల్లిదండ్రులు తమ నడవడికను తీర్చిదిద్దుకోవాలి. తమ జీవనాన్ని సంయమనంతోనూ, పవిత్రంగానూ సాగించాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు మంచి విషయాలు నేర్చుకొంటారు. ఉత్తములవుతారు. పిల్లలకెపుడూ మంచి విషయాలు చెప్పాలి. భగవత్ చరిత్రలతోపాటు దేశ చరిత్రలు, గొప్ప వాళ్ల జీవన విధానాలు చెపుతూ ఉండాలి.

పిల్లల్ని బడికి పంపుతున్నాం కదా! అంటే సరిపోదు. అవి మార్కుల చదువులు. ర్యాంకుల చదువులు. ఉద్యోగాల చదువులు. ఉద్యోగం రాకుంటే ఆచదువులకు ఉపయోగం ఉండదు. మంచి సంఘజీవిగా, మంచి



పౌరుడిగా తన బిడ్డ బతకాలంటే తల్లిదండ్రులు దగ్గరుండి మంచి విషయాలను నేర్పించాలి, బోధించాలి.

గృహస్థు డబ్బు సంపాదించడం మీదనే మనసు పెట్టకూడదు. పిల్లల నడవడిక మీద కూడ మనసు పెట్టాలి. పిల్లలు చెడిపోయే దశలో ఉంటే గృహస్థు సంపాదించిన ధనం వాళ్లను మరింత చెడగొట్టే అవకాశం వుంది.

చదువులు చెప్పే గురువులు కూడా మంచి నడవడిక కలవాళ్లై ఉండాలి. ధార్మిక విద్యకోసం కొంత సమయం కేటాయించాలి. పెద్దలెంత నిరాడంబరంగా వుంటే పిల్లలు కూడా అంత నిరాడంబరంగా ఉంటారు.

**తల్లిదండ్రులు - కొడుకులు - కూతుళ్లు :-**

కొడుకులు, కుమార్తెలు తమ ఇంట పుట్టారు



గనక మనం వీళ్ల క్షేమం చూడాలి అన్న కాంక్షతో తల్లిదండ్రులు కృషి చేయాలి. పిల్లల్ని అధికారంతో కాకుండా అనురాగంతో చూడాలి. పిల్లల్ని చిన్నతనం నుంచే క్రమశిక్షణలో పెట్టాలి. మంచివిద్య నేర్పించాలి.

అలాగే పిల్లలు సుహృద్భావంతో తల్లిదండ్రుల్ని అర్థం చేసుకోవాలి. వారికెప్పుడూ మనఃక్లేశం కలిగించకూడదు. అపకీర్తి తేకూడదు.

**సోదరప్రేమ :-**

సోదర ప్రేమలోని ఔన్నత్యం భారతీయ కుటుంబవ్యవస్థలో అనాదిగా వున్నదే! మహాభారతంలో అనేక సందర్భాల్లో సోదరప్రేమకున్న గొప్పతనం గుర్తించవచ్చు. పాండవుల్లో మొదటివాడైన ధర్మరాజు ధార్మిక నిష్ఠలో అతని సోదరులు కూడా పాలుపంచుకొన్నారు. అన్నగారితోపాటు వాళ్లూ

అరణ్యవాసం, అజ్ఞాతవాసం చేశారు. భీముడు, అర్జునుడు బలవంతులై కూడా ఎన్నడూ ధర్మరాజు ఆజ్ఞను జవదాటలేదు. ఆయన అభిప్రాయానికి అనుగుణంగానే వాళ్లు తమ కోపతాపాల్ని అదుపుచేసుకొన్నారు. నిజానికి వారికి ధర్మరాజంటే భయంకాదు, భక్తి. జ్యేష్ఠ సోదరుడైన అన్నగారిని తండ్రితో సమానంగా గౌరవించాలనే భారతీయ సంప్రదాయమే వాళ్లకు ధర్మరాజు పట్ల విధేయతను పెంచింది. అన్నను తమ్ముళ్లు తండ్రితో సమానంగా గౌరవించాలనేది భారతం నుండి మనం గ్రహించాల్సిన సందేశం.

రామాయణంలో రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు ఒక తల్లిబిడ్డలు కాదు. సవతి తల్లుల బిడ్డలైనా సోదరులు. కానీ ఒకరికోసం ఒకరు ప్రాణం యిచ్చేంత ప్రేమ వాళ్ల మధ్య వుంది. లక్ష్మణుడు తన భార్యనూ, తల్లిని కూడా



వదలి నారబట్టలతో అన్న శ్రీరామునితో వనవాసానికి వెళ్లాడు. రాముణ్ణి నిత్యం వెన్నంటే వున్నాడు.

భరతుడు, శత్రుఘ్నుడు ఒక తల్లి బిడ్డలు కాకపోయినా వాళ్లు నిత్యం కలిసే వున్నారు. భరతుడికి రాముడు సవతి తల్లికొడుకైన సోదరుడైనా రాముడి రాజ్యాన్ని అనుభవించడానికి భరతుడు ప్రయత్నించలేదు. పైగా వచ్చిన అవకాశాన్ని తిరస్కరించాడు. అటువంటి ప్రయత్నం చేసిన తల్లిని పరుషవాక్కులతో నిందించాడు. సవతితల్లి కొడుకైన అన్నగారి పాదుకల్ని, తలమీద పెట్టుకుని, మోసి తెచ్చి పాదుకలకు పట్టాభిషేకం చేశాడు. భరతుడి అనురాగానికి తగిన సోదర ప్రేమను రాముడు చూపించాడు. సోదరప్రేమకు శ్రీరాముడు ఆదర్శం అనే మాటను నిజం చేశాడు.



మహాభారతంలోని కుంతి కూడా సవతి బిడ్డలపై ఎటువంటి వివక్షా చూపలేదు. ధర్మజ భీమార్జునుల్ని ఎంత ప్రేమగా చూసుకొనిందో నకుల సహదేవుల్ని కూడా అంతే ప్రేమగా చూసుకొనింది. పైగా ఆమెకు సహదేవుడంటే అధికప్రేమ. వనవాసానికి వెళ్లేటప్పుడు సహదేవుణ్ణి గురించి ద్రౌపదికి కుంతి చెప్పిన జాగ్రత్తలే యిందుకు ఉదాహరణ. సవతి బిడ్డలైనా, కన్నబిడ్డలైనా ఒకేవిధంగా చూడాలనేదే భారతీయ సిద్ధాంతమని ఈ సంఘటన తెలియజేస్తుంది.

సవతి బిడ్డలైన సోదరులమధ్య ప్రేమానురాగాలు ఉండవనేది కేవలం అపోహ మాత్రమే! భారతీయ సంప్రదాయం అటువంటి విభేదాల్ని ప్రోత్సహించదు. ఇందుకు రామాయణ, భారతాలు సాక్ష్యాలు. ఈ రెండు ఇతిహాసాల్లో సవతి బిడ్డలైన సోదరులు ఎలా మెలగారో



గమనిస్తే భారతీయ కుటుంబ జీవనం ఎంతటి ఉత్తమ సంస్కారాన్ని నేర్పుతుందో అర్థమవుతుంది.

**అత్తాకోడళ్ళు :-**

అత్తాకోడళ్ళు అంటేనే పరస్పరం విభేదించుకునే వాళ్ళు అనే అభిప్రాయం సమాజంలో పాతుకొని పోయింది. ఇది సరయిన పద్ధతికాదు. అత్తాకోడళ్ళు అంటే తల్లీకూతుళ్లే అనే అర్థం బలపడేటట్లు సమాజం మారాలి. కోడలు కన్నవాళ్ళను వదిలి తన అత్తగా గారింటికి వస్తుంది. ఆమెను బిడ్డలాగా చూసుకోవాలి అని ప్రతి అత్తా భావించాలి. కోడలు కూడా అత్తను పరాయి మనిషిగా చూడకూడదు. కొత్తచోట మొదట్లో సమస్యలు ఎన్ని ఎదురయినా సమయస్ఫూర్తితో, ఓర్పుతో చక్కదిద్దుకోవాలి. అన్నా వదినెలు తల్లిదండ్రులలాంటి వాళ్ళు అనేది మనకుటుంబ వ్యవస్థలోని విశేషం. అన్న భార్య సీతలాగా,

మరిది భరతుడులాగా వుండాలి. ఇలాగే బావ, బావమరదళ్ల మధ్య బాంధవ్యం వుండాలి.

**అన్నదమ్ములు – అక్క చెల్లెళ్ళు :–**

భాగాలు పంచుకోవడంలో అన్నదమ్ముల మధ్య తగాదాలు వస్తుంటాయి. అక్కాతమ్ముళ్ల మధ్య, అన్నా చెల్లెళ్లమధ్యకూడా ఇవి ఒక్కోసారి తగాదాలకు దారితీస్తుంటాయి. ధనానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం వల్ల కుటుంబ సభ్యుల మధ్య అగాధాలు ఏర్పడతాయి. డబ్బు పోతే సంపాదించుకోవచ్చు గాని, మనుషులు దూరమయితే మళ్ళీవాళ్లను చేరదీయడం కష్టం. కనుక ధనాని కంటే కుటుంబ అనుబంధాలకే ప్రాధాన్యం యివ్వాలి. సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలి.

**గృహస్థు – ధనసంపాదన :–**

శరీర శ్రమతో ఇతరుల హక్కులకు భంగం



కలగకుండా జాగ్రత్తగా ధనార్జన చేయాలి. తనకోసం, తన వారసుల కోసం పరిమితిని మించి అక్రమార్జన చేసి, కూడబెట్టడం వారసులకు మంచి చెయ్యదు సరికదా వాళ్లను సోమరులుగా మార్చుతుంది. అంతేగాక యజమాని సంపాదించిన దాంట్లో మూడొంతులు తనకుటుంబం కోసం ఖర్చుచేసి, నాలుగోవంతు సమాజంకోసం ఖర్చుపెట్టాలి. దానధర్మాలు చేయకుండా దాచిపెట్టిన ధనం పరులపావుతుందని పెద్దలు చెపుతారు.

“నేను మీకు ఇచ్చే సంపదకు మీరు యజమాని కాదు, ధర్మకర్త మటుకే. ఆ విషయాన్ని మీరు మరిచి కూడబెడితే ఆ ధనానికి యజమానిని తిరిగి నేనే నిర్ణయిస్తాను” అని భగవంతుడు మనతో అంటాడట. ఈ విషయం ఈశావాస్యోపనిషత్తులో ఉందని మహాత్మాగాంధీతన జీవిత కథలో రాశారు. దీనికి



సంబంధించిన సంఘటనలు ఎన్నో కన్పిస్తాయి. కష్టపడి వేలమైళ్లు తిరిగి తేనెటీగలు సంపాదించి తేనెపట్టును పెడితే, మానవుడు పొగపెట్టి, వాటిని తరిమి తాను అనుభవించడం అందరికీ తెలిసిందే కదా! తనింత తిని, పదిమంది కింత పెట్టడం అనాదిగా వస్తున్న మన సంప్రదాయం. వందల, వేల కోట్లు బ్యాంకుల్లో దాచడం మన సంస్కృతి కాదు.

**గృహస్థు – సేవకులు :–**

గృహస్థు సేవకుల్ని తనయింటి సభ్యులు గానే భావించాలి. యజమానికి అండదండా వాళ్లేకదా! సేవకులూ యజమానుల పట్ల కృతజ్ఞతా భావంతో వుండాలి. విశ్వసనీయతకు ఎక్కడా భంగం కలిగించకూడదు.



**గృహస్థు– అతిథి :–**

అతిథి సేవలో తరించడం గృహస్థు బాధ్యత. అతిథి యింటికి వచ్చి, భోజనం చెయ్యకుండా వెళితే అతడు యింటి యజమాని పుణ్యం తీసుకొనిపోతాడు. తన పాపం యిచ్చి పోతాడు. కనుక అతిథికి తప్పకుండా అన్నం పెట్టి పంపాలి. అతిథిని గ్రహస్థుడు పరమాత్మస్వరూపుడిగా భావించాలి. అందుకే ‘అతిథిదేవోభవ’ అన్నారు.

**అతిథిదేవో భవ :–**

అతిథుల్ని భగవంతుడి రూపాలుగా భావించడం భారతీయ సంప్రదాయం. పూర్వం చాలా కుటుంబాల్లో అతిథులు లేకుండా భోజనం చేసేవాళ్లు కాదు. అతిథులు భోజనం చేసి ఆనందించి ఆశీర్వదిస్తే తమ జన్మ ధన్యమైనట్లు భావించేవాళ్లు.

అతిథి మర్యాదలు ప్రతి ఒక్కరికీ కనీస ధర్మం. కుటుంబ వ్యవస్థ పరమార్థం యిదే! అతిథుల్ని సంతృప్తి పరచినపుడే కుటుంబ సభ్యులజన్మ సఫలం అవుతుంది. ఈ జ్ఞానం కలగడమే కుటుంబ వికాసం. అటువంటి కుటుంబ సభ్యులు సమాజంలోని లోపాలు సరిదిద్దగలుగుతారు. ఈ పరిణామమే సమాజ వికాసానికి తోడ్పడుతుంది.

**గృహస్థు – ఇరుగుపొరుగు :-**

పొరుగువారిని తమ కుటుంబసభ్యులుగానే భావించాలి. భగవంతుని దృష్టిలో అందరూ సమానమే! అందరూ సోదరులే! గృహస్థు తన పిల్లల్ని ప్రేమించినట్లే పొరుగువారి పిల్లల్నీ ప్రేమించాలి. అలా చేయడం వల్ల పొరుగువాళ్ళు సైతం గృహస్థు పిల్లల్నీ అభిమానిస్తారు. ఇది ఒక విశేషలాభం. పండుగలు, పబ్బాలప్పుడు పిండి



వంటల్ని ఇరుగుపొరుగు వాళ్లకు పంచాలి. దీనివల్ల అందరం ఒకే కుటుంబం అన్న భావన కలుగుతుంది. ఇచ్చి పుచ్చుకొనే ధోరణులు వ్యక్తుల మధ్య ఆత్మీయతల్ని వృద్ధి పరుస్తాయి. అందుకే 'ఇదిగో అమ్మా పుల్లగూర! అంటే, ఇదిగో అమ్మా తియ్యగూర!' అనే సామెత పుట్టింది. చిన్న చిన్న విషయాలకు తగాదాలు పడకూడదు. సర్దుకు పోయేతత్త్వం అలవడాలి.

**దుష్టుడైన భర్త–భార్య :-**

భార్య దుష్టుడైన భర్తను పరిత్యజించకూడదు. పతివ్రతా ధర్మంతో మెలగుతూ, భర్తను మంచిదారిలోకి మళ్లించు కోవడానికి సహనంతో ప్రయత్నించాలి. పురుషుడు కూడా స్త్రీమీద ఎపుడూ చేయిచేసుకోకూడదు. ఆపద వచ్చినపుడు స్త్రీలు ధైరంగా వుండాలి. ఆత్మహత్య అనే పాపపు ఆలోచన చేయకూడదు. భగవత్ స్మరణం



చేసుకుంటూ ధైర్యంగా నిలవాలి. కాలక్రమేణా అన్ని సమస్యలు చక్కబడతాయి. రాత్రి వెంటపగలు తప్పకుండా వుంటుంది గదా! పురుషులు మద్యపానం, ధూమపానం, గుట్కాలు సేవించడం చేయకూడదు. అవి అరోగ్యాన్ని పాడుచేస్తాయి.

**తల్లి – భార్య :-**

ఇది పెద్ద సమస్య. ఎవరివైపు మాట్లాడినా ఇబ్బందే! తల్లిగురించి భార్యకు చెప్పాలి. ఆమె ఎలా కష్టపడి తనను పెంచి, పెద్ద చేసిందో చెప్పాలి. అలాగే భార్యను గురించి తల్లితో అందర్నీ, వదులుకొని వచ్చింది కదా! అని నచ్చ చెప్పాలి. ఎవరివైపూ ఒరిగి మాట్లాడకూడదు. కుటుంబంలోని సభ్యుల మధ్య పలురకాల తగాదాలు వస్తూ ఉంటాయి. యజమాని చాలా నేర్పుగా, ఓర్పుగా వ్యవహరించాలి.



**తల్లి – ప్రాధాన్యత :-**

కంటికి కనిపించే దైవం తల్లి. తన ప్రాణాన్ని పణంగా పెట్టి, బిడ్డకు జన్మనిస్తుంది మాతృమూర్తి. కష్టాలు, దుఃఖాలు, వ్యథలు, బాధలు తాను భరిస్తూ సంతానానికి సుఖాన్ని అందిస్తుంది. ఎంతటి గొప్పవ్యక్తి అయినా అతడి తొలి అడుగు, పలుకు అమ్మతోనే. తాను పస్తులుండి బిడ్డల కడుపునింపడానికి ఆరాటపడేది అమ్మమాత్రమే! అందుకే 'మాతృదేవోభవ' అంటూ తల్లిని గౌరవించే సంస్కృతి మనకు అనాదిగా వుంది.

మాతా పితరుల కావడి మోసి, తీర్థయాత్రలకు తీసుకొని వెళ్ళిన శ్రవణుడు, తల్లికోసం తలనే పోగొట్టుకున్న గణపతి, తల్లిదీవెనతో జగత్ విఖ్యాతి పొందిన శంకరాచార్యులు, తల్లికోసం కైలాసాన్ని లంకలో

ప్రతిష్ఠించాలని భావించిన రావణుడు మొదలైన వారు మన పురాణాల్లో కన్పిస్తారు. స్ఫూర్తినిస్తుంటారు.

మహాత్మాగాంధీ, శివాజీ, వివేకానంద మొదలైన వారంతా తల్లి అందించిన జ్ఞానంతో స్ఫూర్తి పొంది ప్రపంచప్రసిద్ధులైనవారే! తల్లి మాటకు విలువ ఇచ్చి, మంచి మాటలతో ఆమెను ఆనందంగా ఉంచడం కంటే వేరే పూజ అక్కరలేదు. కన్నతల్లి పాద ప్రక్షాళన కన్నా వేరే అభిషేకం లేదు. తల్లి ఆజ్ఞ పాలించడమే మంత్రోచ్చారణ. 'మాతః సమస్త జగతాం' అని భావించడం బిడ్డలందరికీ గౌరవం కదా!

**తండ్రి – ప్రాధాన్యత :–**

తండ్రి అంటే నడిచే దైవం. ఏ వ్యక్తి అయినా పరిపూర్ణ శక్తి యుక్తులు పొందాడు అంటే అది తండ్రి



చలవే! అమ్మ ఆప్యాయత, ఆదరణ అందిస్తే నడవడిక నేర్పేవాడు తండ్రి. అడిగితే వరాలు యిచ్చేవాడు దేవుడు. అడగకనే అన్నీ కూర్చేవాడు తండ్రి. తాను అనుభవించిన కష్టాలు తన పిల్లలకు రాకూడదని, ఏ సుఖాలు తాను ఆశించి పొందలేక పోయాడో అవి పిల్లలకు దక్కాలని భావిస్తాడు తండ్రి. తాను సామాన్యుడే అయినప్పటికీ, తన పిల్లల్ని అసామాన్యులుగా చేయాలని ఆరాటపడతాడు. రాయి వంటి శిశువును శిల్పంగా మార్చేవాడు తండ్రి.

అటువంటి తండ్రిని వృద్ధాప్యంలో నలుగురిలో చిన్న బుచ్చక, తూలనాడక, నిందించకుండా ఉండటం పుత్రుల కనీసధర్మం. పితృభక్తికి రాముడు, భీష్ముడు మంచి ఉదాహరణలు. వారి నుంచి మనం ఎంతో స్ఫూర్తిని పొందవచ్చు.



**ఆదర్శ దాంపత్యం :–**

భోగాల వల్ల ఎప్పటికీ నిజమైన సుఖం లభించదని భార్యాభర్తలు తెలుసుకోవాలి. త్యాగం, కర్తవ్యపాలన వల్లనే సుఖశాంతులు కలుగుతాయని గ్రహించాలి. ఇదే ఆదర్శదాంపత్య జీవితానికి తొలిమెట్టు, మలిమెట్టు కూడా.

ఎట్టి పరిస్థితుల్లో కూడా దైవాన్ని మరిచి పోకూడదు. ఆయనే సర్వాధికమైన ప్రేమకు ఆస్పదుడు. స్త్రీ పతిప్రేమలో ఆవిధమైన ప్రేమను సాక్షాత్కరింప జేసుకోవాలి. స్త్రీలలో సాహసం కోరుకోతగిందేకాని, తనకుగాని, తన భర్తకు పిల్లలకు గాని, అపాయం ఎదురయినపుడు ఆమెలో సతీత్వం, మాతృత్వం క్షుణ్ణంగా స్థిరపడినపుడు అదిసాధ్యమవుతుంది. భరత వర్షం స్త్రీని అబలగా ఎప్పుడూ చెప్పలేదు.



స్నేహమయి అయిన తల్లి, ప్రేమమయి అయిన పత్ని, వీరాంగనగామారి, యుద్ధ చిహ్నాలతో, రంగంలో దిగితే దుష్టుల బారినుండి తనను, తన భర్తను, పిల్లల్ని కూడా రక్షించుకొని, సమాజానికీ, దేశానికీ అపరిమితమైన శుభం కలిగించి ఆదర్శప్రాయమవుతుంది.

ఒక అత్యాచారిని ఒక అనాచారిని దండించడం కోసం తన తల్లి, చెల్లి చండిగా మారొచ్చు. కాని మన రక్షణ, పోషణ కోసం ఆమె హృదయం నుంచి ఎప్పుడూ అమృతం ప్రవహిస్తూ ఉండాలి.

స్త్రీ నిజానికి పరమాత్మరూపంలో ఉన్న భర్త యొక్క ప్రేమను పొందటమే ఆమెలోని విశేషగుణం. ఆమెను స్వీకరించడమే పురుషుడి భాగ్యం. ఆమె యింటికి రాణి. త్యాగమయి. వివాహం అనేది ఒక సంస్కారం. పవిత్రమైన, శుభకరమైన అనుష్ఠానం సర్వత్ర మంగళం,

ఆనందం. భార్యాభర్తలు ఒకరికొకరు నిండుదనానికి ప్రతీకలు. ఒకరు లేకపోతే మరొకరు సగమే! ఇరువురు కలిస్తేనే పరిపూర్ణత. ఒకరు మరొకరికి సహధర్ములు, జీవన సహచరులు. అభిమానులు, ప్రేమాస్పదులు. ఒక్క మాటలో చెప్పాలంటే భార్యాభర్తలు అంటే ఒక ప్రాణం, రెండు దేహాలు. భార్యకు భర్తే పరమేశ్వరుడు. భర్తకు భార్య స్నేహితురాలు, అర్ధాంగి, కేవలం దాసి కాదు

**కుటుంబం – వసుధైక భావన :-**

కుటుంబం అంటే రక్తసంబంధీకులైన వ్యక్తుల సమూహం. అయినప్పటికీ మనస్తత్వాలు భిన్నంగా వుండే అవకాశాలు ఎక్కువ. అయితే వీటన్నింటినీ మించిన ఆత్మీయతానుబంధం వాళ్లని కట్టి పడవేసి వుంచుతుంది. ఆ ఆత్మీయతానుబంధం ముందు వ్యక్తిగత స్వార్థాలు దిగదుడుపే!



వ్యవసాయం ప్రధానవృత్తి అయిన మనదేశంలో ఉమ్మడి కుటుంబవ్యవస్థ అనాదిగా వేళ్లూనుకొని వుంది. ఉన్నతమైన భారతీయ సంస్కృతికి అదే మూలం. ఇంట్లో వున్న సభ్యులందరూ కాయకష్టంచేయడం, వ్యవసాయాన్ని వృద్ధి చేయడం, ఫలాన్ని స్వార్థబుద్ధిలేకుండా అందరూ అనుభవించడం, పండగలప్పుడు పదిమంది కింత పెట్టి, తృప్తి పొందడం – ఇవన్నీ భారతీయ గ్రామీణ వ్యవస్థలోని ఉమ్మడి కుటుంబాల్లో కన్పించే లక్షణాలు.

కుటుంబసభ్యులందర్నీ ప్రేమించే స్వభావం చిన్నప్పటినుంచి ఉమ్మడి కుటుంబవ్యవస్థలో అలవాటు అవుతుంది. దాని వల్ల సమాజంలో కన్పించే వివిధ ఆర్థికపరిస్థితుల్ని, ఇతర వ్యక్తుల్ని, ప్రేమించేగుణం ఏర్పడతుంది. ఉమ్మడి కుటుంబంలో కష్టనష్టాల్ని అనుభవించడం వల్ల ఇతరుల సమస్యల్ని, సాధక



బాధకాల్ని, అర్థం చేసుకునే సామర్థ్యం, సానుభూతి తత్త్వం అలవడతాయి. అందరూ మనవాళ్లే అనే భావన కలుగుతుంది. ఈ విధంగా కుటుంబంలో నేర్చుకున్న సంప్రదాయాలు, మర్యాదలు, ఆచారాలు, అన్నీ సమాజానికి తోడ్పడటమే కాకుండా నేను ప్రపంచంలో ఒక సభ్యుడ్ని అనే భావనను పెంపొందిస్తుంది. ఇదే వసుధైక భావన.

**కుటుంబం – సమగ్రరక్షణ కేంద్రం :-**

మొన్న మొన్నటివరకు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలంగా వుండేది. కాలక్రమేణా అది చిన్నాభిన్నం అయిపోయింది. దానికి కారణాలు విదేశీయులరాక, ప్రపంచంలో భారతదేశానికి సంబంధాలు పెరగడం, చదువులు, ఉద్యోగాలు వ్యాపారాలు, రాజకీయాలు మొదలైనవన్నీ వ్యవసాయం కంటే లాభసాటిగా



అనిపించాయి. ఈ కారణాలవల్ల చిన్న చిన్న కుటుంబాలు వచ్చాయి. భార్యాభర్తలు, ఇద్దరుపిల్లలు మొన్న మొన్నటి వరకు కన్పిస్తే, ఇటీవల కాలంలో ఒక కొడుకుతోనో, ఒక కుమార్తె తోనో సరిపెట్టుకొంటున్నారు. భార్య ఒక చోట ఉద్యోగం, భర్త ఒకచోట ఉద్యోగం. ఉన్న కూతురో, కొడుకో హాస్టల్‌లో వుండి చదువుకొంటున్నారు.

అందరిలో సామూహిక భావన పోయింది. ఒంటరిననే భావన క్రమంగా పెరుగుతూ వున్నది. ఆర్థికంగా ఇంకా ఇంకా ఎదగాలనే తాపత్రయంతో బంధువులతో, చుట్టాలతో, అంటీముట్టని ప్రవర్తన అలవాటు అయిపోతున్నది. ఎవరికి వారే యమునా తీరే ...అన్నట్లు మానవ సంబంధాలన్నీ, మనీ సంబంధాలై పోయాయి.

అందరీ దృష్టి బ్యాంక్ డిపాజిట్ల మీదే వుంటున్నది. ఇబ్బందుల్లో వున్న సాటివాడిని ఆదుకుందామన్న ధ్యాసే లేదు. 'యద్భావం తద్భవతి' అన్నట్లు ఎదుటి వాళ్ళు కూడా మనతో అంటీ అంటనట్లుగా ముట్టీ ముట్టనట్లుగా ప్రవర్తిస్తున్నారు. ఎంతవున్నా ఒంటరితనం మానవాళిని నేడు బాధిస్తున్నది.

తాతయ్యలు, నాయనమ్మలు పిల్లలకు విద్యాబుద్ధులు చెప్తుండేవాళ్ళు. పురాణాల్లోని మంచి విషయాల్ని గురించి, ఆదర్శవ్యక్తుల్ని గురించి తమ జీవితానుభవాల్ని గురించి పిల్లలకు చెప్పడం వల్ల పిల్లలకు మంచీ- చెడ్డా తెలిసేవి. మన సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన ఏర్పడేది. సమస్యలు వచ్చినపుడు కుంగిపోక, ఆత్మ స్థైర్యంతో వాటిని ఎదుర్కొని విజయం సాధించేవారు. ఇపుడు ప్రతి చిన్న విషయానికి కుంగి



పోవడం, ఆత్మహత్యలకు పాల్పడటం ఆత్మన్యూనతాభావం ఎక్కువ అయిపోతున్నాయి. అందుచేత కుటుంబంలోని సభ్యులందరూ ఆత్మస్థైర్యంతో సమస్యలకు పరిష్కారాలు కనుగొంటూ ఐక్యతాభావంతో కుటుంబంలో ఆనందాహ్లాదాలు వెల్లివెరిసేటట్టు చేస్తూ సమాజ వికాసానికి దోహదపడాలి.

* * *

61

62

63

64

65

66

67

68

**69**

**70**

**71**

**72**

73

74

75

76

77

78

79

80